# అడవి తల్లికి గర్భశోకం



పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల ప్రాధాన్యం గురించి ఏ పదో తరగతి విద్యార్థినడిగినా అయిదు నిమిషాలు గడగడా చెప్పగలడు. కనీసం అర ఠావుకు తగ్గకుండా రాయగలడు. కానీ పీఠాలెక్కిన పాలకులకు మాత్రం తమకు పడే ఓట్లు తప్ప చెట్లు, పుట్టల ప్రాధాన్యం బొత్తిగా తెలియదు. అడవిబిడ్డల అవసరాలు అసలే పట్టవు. అక్షరశక్తి కరవై, కనీస సౌకర్యాలులేక వేల సంఖ్యలో ఆదివాసీ గ్రామాలు నానాటికీ చీకట్లోకి కూరుకుపోతున్నాయి. తరాలుగా అడవితల్లి నీడలోనే బతుకుతున్నా అటవీ భూములపై హక్కుమాత్రం వారికి ఎండమావిగానే మిగిలిపోయింది. చారిత్రక తప్పిదం జరిగిపోయిందని యు.పి.ఏ. సర్కారు ఎంతగా నాలుక్కరుచుకున్నా ఈ నేతలకు గిరిజనులంటే అలుసన్నది దాచినా దాగని సత్యం. అభివృద్ధి ప్రాజెక్టుల పేరిట వేల ఎకరాల అడవులను హరించేందుకు వెనుకాడని నేతలు- అటవీ పరిరక్షణకు ప్రాణప్రదమైన ఆదివాసులను మాత్రం దూరంగానే నెడుతున్నారు. నేడు ప్రపంచ అటవీ దినోత్సవం. ఏటా ఈ ఉత్సవాలను జరుపుతూనే ఉన్నారు. కానీ, అడవితల్లి బిడ్డల దురవస్థ మాత్రం సర్కారీ పెద్దలకు ఏనాడూ పట్టలేదు.

## ఆగని దారుణం

ఆదివాసుల సంప్రదాయ హక్కులపై తొలి పంజాదెబ్బ బ్రిటిష్ హయాములో పడింది. వలసపాలకుల విధానాలనే ఇప్పటి నాయకులూ తుచ తప్పకుండా పాటిస్తున్నారు. బ్రిటిష్ ప్రభుత్వం 1855లో మొదటిసారిగా అటవీ విధానాన్ని ప్రవేశపెట్టింది. తమ అవసరాలమేరకు అడవుల్లోని కలప పూర్తిగా ప్రభుత్వ సొత్తేనని నిర్ధారించేసింది. 1865నాటి చట్టం అడవులను పూర్తిగా బ్రిటిష్‌వారు తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి వీలు కల్పించింది. 1878లో అడవులపై ఆదివాసుల సంప్రదాయ హక్కులపై ఆంక్షల విధింపుతో అసంబద్ధ సంప్రదాయం ప్రారంభమైంది. నేటికీ అది ఎడతెగకుండా కొనసాగుతూనే ఉంది. 2001 జనగణన ప్రకారం దేశంలో 8.2 శాతం అంటే 8.44 కోట్ల ఆదివాసీ జనాభా ఉంది. దేశంలో 461 రకాల ఆదివాసీ తెగలున్నాయి. వీరిలో 92 శాతం మంది అరణ్యాల్లో వ్యవసాయం, వేట, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. మనరాష్ట్రంలో 50 లక్షల 24వేల గిరిజన జనాభా ఉంది. రాష్ట్ర జనాభాలో ఇది 6.9 శాతం. రాష్ట్రంలోని 33 గిరిజన తెగల్లో 30 వరకూ అడవుల్లోనూ, ఆ చుట్టు పక్కల నివసిస్తున్నాయి. మిగిలిన మూడు తెగలు మాత్రమే అడవుల బయట జీవిస్తున్నాయి. మొత్తంలో 60 శాతం గిరిజనులు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ.)ల పరిధిలోకి వచ్చే జిల్లాల్లో నివసిస్తున్నారు. గిరిజనులు తమ మనుగడ కోసం ప్రధానంగా అటవీ ఉత్పత్తులు, పోడు వ్యవసాయంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. అడవుల్లోని జిగురు చెట్లు, చింత, ఉసిరి చెట్ల వంటివాటిని గిరిజనులు తమ ఆస్తిగా పరిగణిస్తారు. ఆ ఉత్పత్తులను సేకరించి గిరిజన సహకార సంస్థ (జి.సి.సి.)కి విక్రయిస్తారు. మార్కెట్ ధరల ప్రాతిపదికన జి.సి.సి. ఆ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంది. గిరిజనులు, ఇతరులు సేకరించే బీడీ ఆకులను అటవీ శాఖ సేకరిస్తుంది. కానీ కొంత కాలంగా జి.సి.సి. నియంత్రణ తగ్గుతోంది. మరోవంక అటవీ వనరులు కరిగిపోతున్నాయి. ఇంకోవైపు బయటివారి చొరబాట్లు పెరుగుతున్నాయి. ఫలితంగా అటవీ వనరులపై గిరిజనుల ఆధిపత్యం క్రమేణా క్షీణముఖం పడుతోంది.

అడవులతో గిరిజనులకు పెనవేసుకుపోయిన అనుబంధాన్ని విచ్ఛిన్నం చేసేందుకు పాలకులు చేయని ప్రయత్నం లేదు. అమాయక ఆదివాసుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగంలోని అయిదో షెడ్యూలులో పొందుపరచిన సూత్రావళి స్ఫూర్తిని మన పాలకులు అడ్డంగా విస్మరిస్తున్నారు. అడవులు, ఆదివాసులు అధికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, జార్ఖండ్ రాష్ట్రాల్లో భారీ పరిశ్రమల ఏర్పాటుకు, ఖనిజ తవ్వకాలకు విచ్చలవిడిగా లాకులెత్తుతున్నారు. అస్మదీయుల, పెట్టుబడిదార్ల జేబులు నింపే కార్యక్రమాన్ని చేపట్టి ఆదివాసుల ఆగ్రహానికి గురవుతున్నారు. గడచిన అరవై ఏళ్లుగా ప్రభుత్వాల తీరుతెన్నులను పరిశీలిస్తే అటవీ విధానాలన్నీ గిరిజనులను అడవులకు దూరం చేసేందుకే ఉద్దేశించినట్లు స్పష్టమవుతుంది. అడవుల వృద్ధి, పరిరక్షణ ద్వారా ఒనగూడే ఆర్థిక ప్రయోజనాలను గిరిజనులకు చేరవేయాలంటూ స్వాతంత్ర్యానంతరం నిర్దేశించుకున్న లక్ష్యాలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి.

నూతన జాతీయ అటవీ విధానం అమలులో భాగంగా వనాల సంరక్షణ, పెంపకంలో ఆదివాసులను భాగస్వాములుగా మార్చేందుకు ప్రపంచ బ్యాంకు నిధులను కేటాయించారు. ఉమ్మడి అటవీ యాజమాన్యం, కమ్యూనిటీ అటవీ యాజమాన్యం పథకాలకింద వనసంరక్షణ సమితుల ద్వారా గడచిన పదేళ్లలో రాష్ట్రంలో వెయ్యి కోట్ల రూపాయలకు పైగా ప్రపంచబ్యాంకు నిధులను ఖర్చు చేశారు. 'కాగ్', పీపుల్స్ ఫారెస్ట్రీ వంటి సంస్థలు ఫలితాలను విశ్లేషించి నివ్వెరపోయాయి. 1997లో ప్రారంభమైన ఉమ్మడి అటవీ యాజమాన్యం పథకం కింద వనసంరక్షణ సమితులకు పోడు భూములను ఇచ్చిన గిరిజనులకు- నష్టపరిహారం, పునరావాసం కల్పించాలన్నది నిబంధన. ఆ మేరకు రెండో విడత ప్రాజెక్టుకింద ప్రపంచబ్యాంకు రూ.650 కోట్లను మంజూరు చేసింది. ఈ నెలాఖరుతో ప్రాజెక్టు కాలపరిమితి ముగుస్తుంది. ఏనాడో పదేళ్ల క్రితం పోడు భూములిచ్చిన గిరిజనులకు పునరావాస కల్పన ఎడతెగకుండా సాగుతూనే ఉండటాన్ని ఈ ఏడాది 'కాగ్' నివేదిక తూర్పారపట్టింది. ఉత్తరాంధ్రలోని 28 వనసంరక్షణ సమితుల్లో పోడు పునరావాస పథకం కింద ఒక్కో నిర్వాసిత గిరిజన కుటుంబానికీ 25 వేల రూపాయలు ఇవ్వాలన్నది లక్ష్యం. పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా ఆచరణలో అది దారుణంగా విఫలమైంది. దీన్నిబట్టి అడవుల సంరక్షణ, పెంపకం గిరిజన భాగస్వామ్యం విషయంలో ప్రభుత్వానికి ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో తేటతెల్లమవుతోంది.

## గిరిజనంపై జులుం

స్వాతంత్ర్యానంతరం మన పాలకులు ఓ వ్యూహం ప్రకారం గిరిజనులను అడవులకు దూరం చేస్తున్నారు. గిరిజనులకు విద్య, వైద్యం, రవాణావంటి మౌలిక వసతులను సమకూర్చడంలో ఘోరంగా విఫలమయ్యారు. రాష్ట్రంలోని మైదాన ప్రాంతాల్లో అక్షరాస్యత 62 శాతం మేరకు ఉంది. కానీ గిరిజన సంక్షేమశాఖ లెక్కల ప్రకారం గిరిజనుల్లో అది 37 శాతానికి మించి లేదు. గిరిజన మహిళల్లో అక్షరాస్యత 26 శాతమే. దేశంలో గిరిజనుల అక్షరాస్యత సగటు 47 శాతం. అయిదో తరగతిలోపు మధ్యలోనే బడిమానేస్తున్న పిల్లలు మైదాన ప్రాంతాల్లో 37 శాతం కాగా- గిరిజనుల్లో 66 శాతం. గిరిజన సంక్షేమశాఖ బడ్జెట్లో అధికభాగాన్ని విద్యాభివృద్ధికే కేటాయిస్తున్నా- పరిస్థితిలో ఇసుమంత కూడా మార్పురావడం లేదు. అడవి బిడ్డలకు నిధుల చేరవేతలో అవినీతి అక్రమాలు అడుగడుగునా అడ్డుపడుతున్నాయని వేరే చెప్పనవసరం లేదు. నిర్వహణ లోపాలు, అక్రమాల కారణంగా మూడింట రెండొంతుల గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం ఉన్నా- వెలుగులు మాత్రం ప్రసరించడం లేదు. శ్రీశైలం ఐ.టి.డి.ఎ. పరిధిలోని రక్షిత అటవీ ప్రాంతంలో సుమారు 120 గ్రామాలున్నాయి. ఇందులో కేవలం ఆరు గ్రామాలకు మాత్రమే విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఐ.టి.డి.ఎ. ప్రాంతాల్లో రాష్ట్రం మొత్తంపై 5.5 లక్షల కుటుంబాలుండగా వారిలో రెండున్నర లక్షల కుటుంబాలకు పక్కా గృహ వసతి కల్పించలేకపోయినట్లు గిరిజన సంక్షేమశాఖ నివేదికలే వెల్లడిస్తున్నాయి. మాటకు ముందోసారి, వెనకోసారి తమది 'ఇందిరమ్మ రాజ్యం' అని చెప్పుకొనే నేతలు- అమాయక గిరిజనులను అడ్డంగా ఎలా విస్మరించారు? ఆదివాసులున్న అటవీ ప్రాంతాలు తీవ్రవాదులకు ముఖ్య స్థావరాలుగా మారుతుండటంతో- అక్కడ శాంతి భద్రతలు క్షీణించాయి. వై.ఎస్. సర్కారు ఏనాడైనా దీన్ని ఓ సమస్యగా గుర్తించిందా? పాలన పగ్గాలు చేపట్టిన తొలినాళ్లలో మావోయిస్టులతో చర్చలు జరిపారు. ఆ తరవాత మావోయిస్టుల అరెస్టులనూ పెంచారు. ఫలితంగా మావోయిస్టులకు, పోలీసులకు మధ్య అడవుల్లో ఆదివాసులు నలిగిపోతున్నారు. అడవులపై గిరిజనుల సంప్రదాయ హక్కులను పునరుద్ధరించి చారిత్రాత్మక తప్పిదాలన్నింటినీ దిద్దుకోవాలన్న లక్ష్యంతో రెండేళ్ల క్రితం అటవీ హక్కుల గుర్తింపు చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. కానీ చివరికి దాన్ని కూడా పాత చట్టాల పంథాలోనే బూజుపట్టించారు. అది అమలు దశలోనే అడ్డం తిరిగింది. గిరిజనులపట్లగానీ, వారి సంప్రదాయ హక్కులపట్లగానీ ఈ ప్రభుత్వానికి ఏ కోశానా చిత్తశుద్ధి లేకపోవడమే ఇందుకు కారణం.

ప్రభుత్వం వేసే ప్రతీ అడుగూ... తీసుకునే ప్రతి నిర్ణయమూ సామాన్యునికి ఎంతో కొంత ఉపశమనం కలిగించాలి. వారి సమస్యలకు పరిష్కారం చూపాలి. నేడు- గిరిజన సంక్షేమం, అడవుల పరిరక్షణ పేరిట పాలకులు చేపడుతున్న చర్యలు ఆదివాసులకు న్యాయం చేయడం లేదు సరికదా వారి ఆందోళనను మరింత పెంచుతున్నాయి. అటవీ వనరులను అయినవారికి దోచిపెట్టడానికి, ప్రకృతి వనరుల పరిరక్షణ పేరిట నిధుల స్వాహాకు- సర్కారీ పెద్దలు తెగబడుతున్న నైచ్యం నేడు బహిరంగ రహస్యం. ఎన్నికలు తరుముకొస్తున్నాయి. గిరిజనుల ఓట్లకు గాలం వేసేందుకు నేతలు మళ్ళీ కల్లబొల్లి కబుర్లు మొదలుపెట్టారు. తమకు నిలువనీడ లేకుండా పాపం చేస్తున్నదెవరో- గ్రహించలేనంతటి అమాయకత్వంలో ఈనాటి గిరిజనులు లేరు. వారు అన్నీ చూస్తున్నారు. అర్థం చేసుకుంటున్నారు. అక్రమార్కులకు వంతపాడుతూ అడవి బిడ్డల జీవితాలతో ఆడుకుంటున్న- పెద్దలు తీరు మార్చుకోవాల్సిన తరుణమిది.

**మధ్యయుగాల్లో రాజులకు ఇష్టమైన క్రీడ మృగయావినోదం. ఆయుధాలు పట్టుకుని అడవులకెళ్ళి కనిపించిన జంతువును చంపితేతప్ప రాజుగారి తృప్తి తీరని కాలమది. ప్రభువుల రోజులు పోయి కొత్త రాజాలొచ్చారు. వారి వినోదాలూ మారాయి. మృగాలను వేటాడ్డం ఇప్పుడు మరీ పాత పద్ధతి. అడవులను ఆక్రమించి సరదా తీర్చుకోవడం, ప్రకృతిపై ఆధారపడినవారి పొట్టగొట్టి ముచ్చటపడటం ఈనాటి నేతల రీతి. గిరిజనం వీరికి ఓట్లుగా తప్ప మనుషులుగా కనపడరు. ప్రకృతి బిడ్డలకు పొగబెట్టి అడవి తల్లికి గర్భశోకం మిగులుస్తున్న నాయకుల నిర్దాక్షిణ్యానికి ఆంధ్రప్రదేశ్ వేదికవుతుండటమే దురదృష్టం.**

– గంజివరపు శ్రీనివాస్